

మంథనిలోని రాజగృహలో కార్యకర్తలతో ముచ్చటిస్తున్న పుట్ట మధూకర్

# మంత్రపురి గడ్డపై గులాబీ జెండా

- బీఆర్ఎస్‌కే ఓటర్ల బ్రహ్మరథం
- మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్
- కార్యకర్తలతో కలిసి పోలింగ్ సరళిపై ఆరా

మంథని, డిసెంబర్ 1: మంత్రపురి గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓటర్లు గులాబీ పార్టీకి జైకొట్టారని తెలిపారు. మంథని రాజగృహలో బల్దియా చైర్‌పర్సన్, తన సతీమణి పుట్ట శైలజతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పార్టీ కార్యకర్తలతో ముచ్చటించారు. 288 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన పోలింగ్ సరళిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లోని ఓటర్లు బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. గెలిచిన తర్వాత పార్టీ, తాను ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానన్నారు. ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థి ప్రలోభాలకు లొంగకుండా ఓటేయడం అభినందనీయమన్నారు. బీఆర్ఎస్ సర్కారు సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు తాను ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్ చేసిన అభివృద్ధి, పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా అందించిన సేవలు ఈ ఎన్నికల్లో ఎంతగానో కలిసి వచ్చాయని సూత్రీకరించారు.

# కష్టపడ్డ గులాబీ శ్రేణులకు కృతజ్ఞతలు

- రాజన్న ఆశీస్సులతో బీఆర్ఎస్ గెలుపు ఖాయం
- వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు




వేములవాడ, డిసెంబర్ 1: తన గెలుపు కోసం కష్టపడ్డ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ విజయం కోసం రెండునెలలుగా ప్రజాప్రతినిధులు, సోషల్ మీడియా వారియర్స్, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు రాత్రింబవళ్లు పనిచేశారని కొనియాడారు. వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు చెప్పారు. మీ అందరూ చూపిన ప్రేమానురాగాలు, వేములవాడ ప్రజల, రాజన్న ఆశీస్సులతో తప్పనిసరిగా మంచి మెజార్టీతో గెలుస్తామని నమ్మకం ఉన్నదన్నారు. ఆదివారం ఓట్ల లెక్కింపు తర్వాత మళ్లీ కలుస్తానని పేర్కొన్నారు. మీతో అనుబంధాన్ని ఇలాగే కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు.

# రాజన్నకు కార్తీక శోభ

స్వామివారిని దర్శించుకోవడానికి క్యూలో ఉన్న భక్తులు







ఆలయం ఎదుట కార్తీకదీపాలు వెలిగించుకుంటున్న భక్తులు, క్యూలైన్లలో భక్తులు

వేములవాడ టౌన్, డిసెంబర్ 1 : కార్తీకమాసం శుక్రవారం వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయం భక్తుల తో రద్దీగా కనిపించింది. వేకువజాముననే భక్తులు స్వామివారి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు చేశారు. భక్తులు అభిషేక మండపంలో మంత్ర పూజలు నిర్వహించుకుని ఆలయ గర్భగుడిలో అభిషేక పూజలు, అన్నపూజలు చేశారు. భక్తులు కల్యాణకట్టలో తలనీలాలను సమర్పించారు. అనంతరం క్యూలో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నను దాదాపు 10 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని, సుమారు రూ.14 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

# రామగుండంలో ధర్మమే గెలుస్తుంది

- ఇక్కడి ప్రజలపై పూర్తి విశ్వాసమున్నది
- సీఎం కేసీఆర్‌కే కోల్‌బెల్ట్ కార్మికుల మద్దతు
- రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్

గోదావరిఖని, డిసెంబర్ 1: రామగుండం నియోజకవర్గంలో ధర్మమే గెలుస్తుందని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విశ్వాసం వ్యక్తం చేశారు. కోల్‌బెల్ట్ కార్మికులందరూ కార్మిక పక్షపాతి అయిన సీఎం కేసీఆర్‌కే మద్దతిచ్చారని పేర్కొన్నారు. శుక్రవారం ఖని చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా డబ్బు, మద్యంతో ఎన్నికల్లో గెలిచేందుకు ఎన్ని ఎత్తులు వేసిన వాటన్నిటిని ప్రజలు పటాపంచలు చేశారన్నారు. సైలెంట్‌గా సాగిన ఓటింగే తనను గెలుపునకు కారణమవుతుందన్నారు. రామగుండం నియోజకవర్గంలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఒక రోజులో 24 గంటలకు గానూ 18 గంటలు ఏడాదిలో 365 రోజులకు గానూ 350 రోజులు తాను ప్రజా సేవలోనే ఉన్నానని చెప్పారు. నిస్వార్థంగ తాను చేసిన సేవకు గుర్తింపుగా ఓటర్లు ఓటు వేసారని పూర్తి నమ్మకం తనకు ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఎన్నికల్లో తనకు స్పష్టంగా తీర్పునిస్తూ వస్తున్న రామగుండం ప్రజలు ఈసారి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రామగుండంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు బేరీజు వేసుకొని ఓటు వేశారని చెప్పారు. తన గెలుపు కోసం రెండు నెలలుగా ఎడతెరిపి లేకుండా ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. నయాపైసా, మద్యం పంచకుండా గెలుస్తున్నాని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు కౌశిక హరి, గోప్పు ఐలయ్య, ఆముల నారాయణ, దేవరాజ్, పర్లపల్లి రవి, జేవీ రాజు పాల్గొన్నారు.

# ప్రజల ఆశీర్వాదం బీఆర్ఎస్‌కే

సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

- అభివృద్ధి ప్రదాత కేటీఆర్‌కు పట్టం గట్టిన్రు
- ఎగ్జిట్‌పోల్స్‌తో ప్రతిపక్షాల గందరగోళం
- బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 1: ప్రజల అభిమానం, ఆదరణలతో తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి రాబోతున్నదని బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ సిరిసిల్లలో చేసిన అభివృద్ధి, బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు ఆశీర్వదించారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేది, నిలిచేది, ప్రజలతో కలిసుండేది కేటీఆర్ అని మరోసారి రుజువు కాబోతుందన్నారు. అభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ వెంటే ప్రజలు నిలిచారని ఉద్ఘాటించారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఫేక్ సర్వేలు, ఎగ్జిట్ పోల్స్‌ను ప్రచారం చేసి ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రం సాధించిన తరువాత జరిగిన మొదటి ఎన్నికల సమయంలోనూ హంగ్ వస్తుందని, ఇతర పార్టీల మద్దతు అవసరం ఉంటుందంటూ ఆందోళనకరమైన అపోహలు సృష్టించారని గుర్తుచేశారు. నాడు బీఆర్ఎస్ పార్టీ స్వతంత్రంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. పదేండ్ల కాలంలోనే యాభై ఏండ్ల అభివృద్ధిని చేసిందన్నారు. మహాకూటమిగా ఏర్పడిన ప్రతిపక్షాలు 2018లో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధి చేసిన కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని పడగొట్టాలన్న కుట్రలు చేశారన్నారు. ఎన్ని కూటములు వచ్చినా ప్రజలంతా బీఆర్ఎస్ వైపే నిలిచారన్నారు. ఎగ్జిట్ పోల్స్ అన్నింటినీ పటాపంచలు చేస్తూ మరోసారి తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి రాబోతున్నదని పునరుద్ఘాటించారు. అదే విధంగా అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా సిరిసిల్లను నిలిపిన కేటీఆర్‌ను ప్రజలు గెలిపించుకోబుతున్నారని పేర్కొన్నారు. ఎన్నడూ గెలువని నాయకులు తామే గెలుస్తున్నామంటూ ప్రగల్భాలకు పోతున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తరువాత వారంతా ఊహల నుంచి నేల పైకి రాబోతున్నారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలకు ప్రజల చేతుల్లో ఛీత్కారం తప్పదని విమర్శించారు. సిరిసిల్లతోపాటు తెలంగాణ రాష్ట్రం కేటీఆర్ నాయకత్వంలో దేశంలోనే అగ్రభాగాన నిలుస్తున్నదని చెప్పారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని తెలిపారు. 2009 తరువాత వచ్చిన ప్రతి ఎన్నికలో కేటీఆర్ పనితీరుకు నిదర్శనంగా ప్రజలు మెజార్టీని అందించారని, ఈసారి ప్రజల తీర్పు భారీ మెజార్టీ వైపు ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, బొల్లి రామ్మోహన్, మ్యాన రవి, అగ్గిరాములు, ఎండీ సలీం, కుంబాల మల్లారెడ్డి, వెంగళ శ్రీనివాస్, చొక్కాల రాము, కంసాల మల్లేశం, మామిడాల కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

# మ్యాథ్స్ ఒలింపియాడ్ పోస్టర్ ఆవిష్కరణ




అల్ఫోర్స్ మాథ్స్ ఒలింపియాడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 1 : వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో శ్రీనివాస రామానుజన్ జయంతి(డిసెంబర్ 22)ని పురస్కరించుకుని నిర్వహించే అల్ఫోర్స్ మాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్ – 2024 గోడ ప్రతిని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, గణిత శాస్త్రం వివిధ పోటీ పరీక్షలకు ఉపకరిస్తుందని, తద్వారా విజయం సాధించడం చాలా సులువుగా ఉంటుందన్నారు. ఈ క్రమంలోనే 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 17న ఉదయం 10 గంటలకు తెలంగాణలోని వివిధ అల్ఫోర్స్ పాఠశాలలు, కళాశాలల్లో ఈ పరీక్షను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలో మొదటి 3 స్థానాల్లో గెలిచిన విద్యార్థులకు ఈ నెల 22న శ్రీనివాసన్ రామనుజన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే జాతీయ గణిత దినోత్సవంలో అతిథుల చేతుల మీదుగా బహుమతులు, నగదు పారితోషికాలను ప్రదానం చేస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరినిన వివరాలకు సెల్ నంబర్లు 91602 94441, 93982 30614, 92469 34441 లో సంప్రదించాలని సూచించారు.